క్లుప్తంగా

రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని వినతి



ఆర్టీసీ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఢిల్లేశ్వరరావు

సరుబుజ్జిలి: శ్రీకాకుళం నుంచి కొత్తూరు వరకు వెళ్లే ఫైవ్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్‌కు రొట్టవలస వద్ద రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయాలని పలువురు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌తోపాటు, ఆర్టీసీ అధికారులకు పాలవలస, రావివలస, రొట్టవలస, పెద్ద, చిన్న పాలెం, దకరవలస, సుభద్రాపురం, అవతరాబాద్, తమ్మినాయుడుపేట, కటకమయ్యపేట గ్రామస్తులు వినతిపత్రం అందించారు. రొట్టవలసలో రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయడం వలన విద్యార్థులు, ఉద్యోగులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ స్టాప్‌లో అధిక శాతం మంది ప్రయాణాలు చేస్తుంటారు. ఆక్యుపెన్సీని దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ అధికారులు బస్సులు నిలుపుదల చేయాలని కోరారు. ఢిల్లేశ్వరరావు, కరణం భార్గవ్, కె.రామారావు, కె.సుశీల, తదితరులున్నారు.

ఊపిరి పోసిన వర్షం..



జాడుపల్లిలో వేసిన కాకర పంట

మెళియాపుట్టి: మండలంలోని జాడుపల్లి, జోడూరు, పట్టుపురం చాపర, మెళియాపుట్టి, మర్రిపాడు-సి, కొసమాల, వసుంధర,రాజపురం తదితర గ్రామాల్లో మెరక పంటలు అధికంగా పండిస్తారు. సోమవారం మధ్యాహ్నం కురిసిన వర్షం ఎంతో మేలు చేసిందని పలవురు రైతులు తెలిపారు. గత 15 రోజులుగా ఎండిపోతున్న వరినారు మడులకు సైతం ఈ వాన ఊపిరి పోసిందన్నారు. మెరక భూముల్లో వేసిన కాకర, దొండ, అంగాకర, బీర, పొడగు చిక్కుడు తదితర పంటలను సాగు చేస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలల్లో ఆటల సందడి



నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

నరసన్నపేట: స్వాతంత్ర్య వేడుకలకు సమయం దగ్గర పడుతుండటంతో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. దీంతో స్కూళ్లల్లో సందడి నెలకొంది. నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆటల కోసం పీఎంశ్రీ పథకం కింద ప్రత్యేకంగా నిధులు మంజూరు చేశారు. 8 రకాల ఆటల పోటీలను నిర్వహిస్తున్నట్లు పీడీలు రమణ, గణపతిరావు తెలిపారు. నరసన్నపేట బోర్డు స్కూల్, ఉర్లాం, బాడాం, సుందరాపురం, బొరిగివలస, కంబకాయ తదితర ఉన్నత పాఠశాలల్లోనూ ఆటల పోటలు నిర్వహించారు.


సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

మెళియాపుట్టి: మండలంలోని గిరిశిఖరాన ఉన్న గూడ గిరిజన గ్రామంలో గల సమస్యలను పరిష్కరించాలని గిరిజనులు కోరారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండల గిరిజన నాయకురాలు బైరిసింగి ధరణి మాట్లాడుతూ.. గూడలో తాగునీటి సమస్య అధికంగా ఉందన్నారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు విద్యుత్, రహదారి సదుపాయాలు కల్పించాలన్నారు. గ్రామంలో నిలిచిపోయిన కాలనీ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. పలువురు గిరిజన మహిళలు ఉన్నారు.

తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు.. కొత్త కోర్సు మంజూరు



ప్రిన్సిపాల్ సత్యనారాయణ

ఆమదాలవలస రూరల్: ఆమదాలవలస మండలంలోని తొగరాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కొత్త కోర్సు మంజూరైనట్లు ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ సోమవారం తెలిపారు. కంప్యూటర్ సైన్స్ ఆనర్స్ కోర్స్ విద్యాశాఖ ఈ ఏడాది కొత్తగా మంజూరు చేసిందన్నారు. కళాశాలల విద్యాశాఖ డైరెక్టర్ భరత్ నారాయణ గుప్త ఆదేశాల మేరకు ఈ కోర్సును ప్రారంభిస్తామన్నారు. ఇప్పటివరకు కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్, మేథమెటిక్స్, బీఎస్సీ జువాలజీ, బీఎస్సీ బోటనీ, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్ కోర్సులు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతన్నా.. జాగ్రత్త!



సీది వద్ద పొలంలో కర్రలకు విద్యుత్ వైర్లను అమర్చి బోరు ద్వారా పారుతున్న నీరు

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటర్లతో అప్రమత్తత అవసరం
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాలకే ముప్పు..
- చిన్నపాటి జాగ్రత్తలతో ప్రమాదాలకు అడ్డుకట్ట



కొరసవాడ సమీపంలో పంట పొలంలో పైపుల ద్వారా పారుతున్న బోరు నీరు

పాతపట్నం: ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటికే రైతులు తమ పొలాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. పంటలకు నీరు పెట్టడం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ తీగలు, మోటార్ల వద్ద ఎక్కువగా పని చేస్తుంటారు. రైతులు చిన్న, చిన్న విద్యుత్ మరమ్మతులు స్వయంగా చేస్తుంటారు. ఇలాంటి సమయంలో జాగ్రత్తలు వహించకపోతే ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. పొలాల్లో వేలాడుతున్న తీగల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

స్టార్టర్లతో జాగ్రత్తలు ఇలా..

స్టార్టర్ డబ్బాలను మోటార్‌కు పక్కన పొలంలో ఉంచి కవర్లు కప్పుతుంటారు. ఇది ప్రమాదాలకు తావిచ్చే అవకాశం ఉంటుంది. వర్షం కురిసినా, బోరు నీరు ఎగజిమ్మినా డబ్బాల్లోకి నీరు చేరుతుంది. తీగలు కూడా గజిబిజిగా ఉండేలా మళ్లీ అతికిస్తారు. ఏ తీగ ఏ ఫీజుదో కూడా తెలియకుండా ఉంటుంది. నేరుగా స్టార్టర్‌కు విద్యుత్ సరఫరా అయ్యేలా ఫీజు అమర్చుకోవాలి. స్టార్టర్ డబ్బాలకు తలుపులు తప్పనిసరిగా ఉండాలి. చాలా మంది రైతులు ఇప్పటికీ స్టార్టర్ల కోసం ఇనుప డబ్బాలను ఉపయోగిస్తారు. ఇనుప డబ్బాల్లో స్టార్టర్, ఫీజులు బిగించడంతో ఎలుకలు డబ్బాలో చేరి తీగలు కొరకడంతో ఆ తీగలు తెగి, డబ్బాకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఇది తెలియక రైతులు డబ్బాను పట్టుకోగానే షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు ఇలా..

- పొలాల్లో మోటార్లు పనిచేయకపోతే చేతితో పట్టుకోకూడదు.
- టెస్టర్ సహాయంతో మాత్రమే పరీక్షించాలి.
- వర్షపు నీరు, తేమ తగలని చోట వీటిని అమర్చాలి.
- ఎర్త్ తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.
- విద్యుత్ మోటర్‌లో అంతరాయం ఏర్పడితే ముందు విద్యుత్ సరఫరా నిలిపివేయాలి.
- ఫీజులు పోతే విద్యుత్‌శాఖ అధికారుల సహాయంతో వాటిని మరమ్మతులు చేయించుకోవాలి.

విద్యుత్ తీగలతో ప్రమాదం..

గాలలకు ఒక్కోసారి పొలాల్లో విద్యుత్ తీగలు తెగిపడుతూ ఉంటాయి. ఆ సమయంలో రైతులు చాలా జాగ్రత్తగా ఉండాలి. అలాగే వ్యవసాయ పనులు ముగించుకుని వైర్లను ఇంటికి తీసుకువస్తారు. ఇంట్లో వైర్లు ఉంచినప్పుడు ఎలుకలు కొరికే అవకాశం ఉంది. మరుసటి రోజు మోటార్ వైర్లు తగిలించేటప్పుడు వాటిని సరి చూసుకోవాలి. పాతవైర్ల కంటే కొత్త వైర్లు బిగించుకోవడం మంచిది. విద్యుత్ స్తంభాలు దూరంగా ఉన్న పొలాల్లో కొంత మంది కర్రల సహాయంతో విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసుకుంటారు. ఇవి వర్షానికి, గాలికి కింద పడుతుంటాయి. వాటిని గమనించకుండా పొలాల్లోకి వెళితే కాళ్లకు తగిలి విద్యుత్ షాక్ తగిలే ప్రమాదం ఉంది. విద్యుత్ అధికారులతో మాట్లాడి స్తంభాలను ఏర్పాటు చేయించుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం



వర్షానికి తడిచిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లను తాకవద్దు. కరెంట్ వైర్లను తాకుతున్న చెట్లను ముట్టుకోవద్దు. పొలాల్లో స్టార్టర్లను మరమ్మతుల చేయించుకోవాలి. స్వయంగా ఫీజులు వేయడం వంటి చిన్న, చిన్న పనులు చేయవద్దు. పొలాల్లో విద్యుత్ తీగలు కిందకు వేలాడితే విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరిచేయించుకోవాలి. విద్యుత్ ప్రమాదాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– జి.ప్రసాదరావు, డీఈఈ, విద్యుత్‌శాఖ, పాతపట్నం

వరుసక్రమంలో నాట్లు వేయడంతో మేలు



సరుబుజ్జిలి: వరుసక్రమంలో వరినాట్లు వేసే విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సరుబుజ్జిలి: వరుస క్రమంలో వరినాట్లు వేయడం వలన అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ సూర్యనారాయణ అన్నారు. రావివలస గ్రామంలో రైతు తిరుపతి రావు వ్యవసాయ క్షేత్రంలో వరుస క్రమంలో వరి నాట్లు వేసే విధానం గురించి రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. వరుస క్రమంలో నాట్లు వేయడం వలన సూర్యరశ్మి తగిలి దోమ, చీడపీడల నుంచి రక్షించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ టీమ్ డీఎంఎంటీ సురేష్, ఐసీఆర్పీలు తిరుపతిరావు, సుమ, పూర్ణారావు పాల్గొన్నారు.

వరి నారు చిగుర్లు తుంచి నాట్లు వేయాలి..

కొత్తూరు: వరి నారు చిగుర్లు తుంచి వరుస క్రమంలో నాట్లు వేయాలని కొత్తూరు డివిజన్ ప్రకృతి వ్యవసాయ ఎంటీ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరుకు చెందిన బి.చిన్నంనాయుడు పొలంలో లైన్ షోయింగ్ పద్ధతిపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల విక్రయం



పాతపట్నం: కూరగాయలు విక్రయిస్తున్న ఆర్‌వైఎస్‌ఎస్ సిబ్బంది



హిరమండలం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తున్న సిబ్బంది

పాతపట్నం: స్థానిక కోర్టు కూడలిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఆర్‌వైఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్టాల్ ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయోత్పత్తులను సోమవారం విక్రయించారు. మండలంలోని గంగువాడ, తీమర, కొరసవాడ గ్రామాల్లో ప్రకృతి సేద్యం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు, ముల్లంగి, టమాటా, చిక్కుడు, వంకాయలు, కొత్తిమీర, ములగ, బియ్యం, తదితర పంటలను విక్రయించారు. ఆర్‌వైఎస్‌ఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు..

హిరమండలం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగుచేసే ఉత్పత్తులు ఎంతో శ్రేయస్కరమని ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా సాగుచేసిన బీర, కాకర, పొడుగు చిక్కుడు, వంగ, బెండ, దొండ, తోటకూర, గోంగూర, బ్రౌన్ రైస్ వంటి ఉత్పత్తులను మండల కార్యాలయం వద్ద సోమవారం విక్రయించారు. ఐసీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

18 మద్యం బాటిళ్లు స్వాధీనం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు గ్రామంలో సనపల తిరుపతిరావుకు చెందిన టీ టైమ్ (షాపు) వద్ద 18 మద్యం సీసాలు సోమవారం పట్టుబడినట్లు ఎస్‌ఐ ఎండీ అమీర్ ఆలీ తెలిపారు. మద్యం సీసాలు సీజ్ చేసి, తిరుపతిరావుపై కేసు నమోదు చేశామన్నారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెళ్లి దాడి చేశామన్నారు.


కరుణించని వరుణుడు




తమ్మయ్యపేటలో వర్షాలు లేక బీటలు వారిన వరి వెద పొలాలు

- ఎండుతున్న వరి పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

ఆమదాలవలస రూరల్: వరుణుడు ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో కరుణ చూపలేదు. ముఖ్యంగా వర్షాధారంపై ఆధారపడిన పంట భూములు బీటలు వారడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు పడకపోవటంతో పలు గ్రామాలు కరువుబారిన పడే ప్రమాదం ఉంది. గత కొన్ని రోజులుగా వర్షలు లేకపోవటంతో వరి వెద పొలాలు పూర్తిగా ఎండుతున్నాయి. ముఖ్యంగా కాలువల పరిధిలో ఉండే కొన్ని గ్రామాలకు అరకొరగా నీరందటంతో అంతగా ఇబ్బంది లేదు. మండలంలోని పలు గ్రామాలు వర్షాధారంపైన ఆధారపడి ఉన్నాయి. ఆమదాలవలస మండలంలోని అక్కులుపేట, శ్రీనివాసచార్యులుపేట, కొల్లివలస, మండాది, దన్నానపేట, సంతకొత్తవలస, కనుగులువలస, తమ్మయ్యపేట, కుద్దిరాం, తిమ్మాపురం తదితర గ్రామాల్లో పంట పొలాలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే పలు గ్రామాల్లో వరి వెదలు ఎండిపోతుండగా.. మరికొన్ని గ్రామాల్లో బీటలు వారుతున్నాయి. సకాలంలో వర్షలు పడకపోవటంతో కొన్ని గ్రామాల్లో పంట పొలాలు బీడు భూములుగా మిగిలిపోయాయి. వరుణుడు కరుణ కోసం అన్నదాతలు ఆశగా ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు.



కలివరంలో ఎండుతున్న వెదలు



కుద్దిరాంలో వర్షాలు లేక బీడు భూములుగా మిగిలిన పంట పొలాలు

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సుడా చైర్మన్ రవికుమార్

పాతపట్నం: మండల కేంద్రంలోని అంతరాబ కూడలి సమీపంలో గల కొరికాన ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఇస్తున్న ఉచిత నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) శిక్షణ తరగతులను సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గంలోని యువతీ, యువకులు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఉచితంగా స్కిల్ డెవలప్‌మెంట్ తరగతులు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హిరమండలం ఏఎంసీ అధ్యక్షుడు మామిడి రామకృష్ణ, నక్క క్రాంతి, డి.బాలరాజు, కర్రి అప్పారావు, ఎం.బాబూరావు, వేణుమాధవ్ పుల్లాయ్ పాల్గొన్నారు.

శ్రీకాకుళం డివిజన్‌లో చేర్చాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యోగేశ్వరరావు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలాన్ని శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో చేర్చాలని కరకవలస సర్పంచ్ యోగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్ ఈశ్వరమ్మకు సోమవారం వినతి పత్రం అందించారు. ప్రస్తుతం ఎల్.ఎన్.పేట మండలం టెక్కలి డివిజన్‌లో కొనసాగుతుండటంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పాలనాపరమైన పనులకు సంబంధించి టెక్కలి వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురవుతున్నట్టు తెలిపారు. శ్రీకాకుళం డివిజన్లోకి మార్చితే సౌలభ్యంగా ఉంటుందన్నారు.

పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు

కొత్తూరు: కొత్తూరు పోలీసుల అదుపులో గంజాయి నిందితుడు ఉన్నట్లు సమాచారం. ఒడిశా రాష్ట్రంలోని హడ్డుబంగి గ్రామం నుంచి కొత్తూరు మండలంలోని మాతల వైపు బ్యాగ్‌లో గంజాయిని ఓ వ్యక్తి సోమవారం తరలిస్తుండగా కొత్తూరు పోలీసులకు మాతల వద్ద పట్టుబడినట్లు తెలిసింది. ఈ విషయాన్ని కొత్తూరు సీఐ సి.హెచ్.ప్రసాదరావు వద్ద ప్రస్తావించగా.. గంజాయి నిందితుడుకి సంబంధించి పూర్తి వివరాలను మంగళవారం తెలియజేస్తామన్నారు.

గోతులమయం..



చింతాడ సమీపంలో గోతులమయమైన ఆమదాలవలస- శ్రీకాకుళం ప్రధాన రహదారి

ఆమదాలవలస: ఆమదాలవలస నుంచి శ్రీకాకుళం వెళ్లే ప్రధాన రహదారి పనులను చింతాడ వద్ద కల్వర్టు నిర్మాణం పేరుతో చాలా రోజులుగా నిలిపివేశారు. ఈ ప్రాంతంలో గోతులు ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. చినుకుపడితే చిత్తడిగా మారుతుంది. శ్రీకాకుళం నుంచి ఆమదాలవలసకు వేల సంఖ్యలో వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారిని బాగుచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురి చేరిక



పార్టీలో చేరినవారితో కేవీజీ సత్యనారాయణ

సరుబుజ్జిలి: మండలంలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన ఆరు కుటుంబాలు వైఎస్సార్ సీపీ విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట గోపాల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం చేరాయి. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో పైడి హరి, పైడి శశి, పైడి సన్యాసిరావుతోపాటు మరో మూడు కుటుంబాలున్నాయి. ఆయా కుటుంబ సభ్యుల వారికి సత్యనారాయణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉపసర్పంచ్ పైడి నర్సింహప్పారావు, పార్టీ కార్యకర్తలు బగాది రామారావు, కిల్లి నర్సింగరావు, పైడి చలపతి, సువ్వారి అన్నంనాయుడు, దుంపల రామారావు, పైల లక్ష్మణరావు, సీపానం నాగం పాల్గొన్నారు.

కేవీజీకి సత్కారం..

పురుషోత్తపురం పంచాయతీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన కేవీజీ సత్యనారాయణను ఆ గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం సుమారు కోటి రూపాయలకుపైగా విలువైన భూమిని దానం చేశారన్నారు. తాగునీరు, విద్యుత్, రహదారులు, మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు.

చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలి



ధర్మపురంలో క్యూ ఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న చింతాడ రవికుమార్, నాయకులు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

పొందూరు: సీఎం చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మండలంలోని ధర్మపురం, బురిడికంచరాం, పిల్లలవలస, దళ్లవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను అందించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, పార్టీ నాయకులు గుడ్ల భాను, చింతాడ సత్యప్రసాద్, పొన్నాన సూరప్పనాయుడు, పైడి నాగభూషణరావు, కిల్లాన సూర్యారావు, బొడ్డేపల్లి ప్రసాద్, సూర ఆనందరావు, జమ్మి నాయుడు, అన్నంనాయుడు, బొత్స రమణ, గంట్యాడ రమేష్, మొదలవలస పాపారావు, మొదలవలస రమణ, గురుగుబెల్లి శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ కృష్ణవేణి

కొత్తూరు: మండల కేంద్రంలోని బోర వీధి, చోడవరపు వీధితోపాటు పలు వీధుల్లో సోమవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వర్షాలు కురుస్తున్నందున మురుగునీటి కాలువలను శుభ్రం చేశారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పడాల లక్ష్మణరావు పర్యవేక్షించారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ శంకరరావు

నరసన్నపేట: విద్యార్థులు, యువకులకు పోక్సో చట్టంపై అవగాహన అవసరమని నరసన్నపేట ఏఎస్‌ఐ శంకరరావు అన్నారు. స్థానిక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఏఎస్‌ఐ మాట్లాడుతూ ఎటువంటి సంఘటనల్లో పోక్సో కేసులు నమోదు చేస్తారు.. శిక్షలు ఏ విధంగా ఉంటాయనేది వివరించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మదన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు గురైతే జీవితమే నాశనం అమవుతుందన్నారు. ఏబీవీపీ ప్రతినిధులు జశ్వంత్, కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

33 మద్యం సీసాలు స్వాధీనం

కొత్తూరు: మండలంలోని బలద గ్రామం (ఆంధ్రా-ఒడిశా సరిహద్దు)లో సోమవారం ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ ఎస్‌ఐ బి.అప్పారావు, సిబ్బంది కలిసి దాడులు నిర్వహించినట్లు కొత్తూరు సీఐ కిరణమణిశ్వరి తెలిపారు. ఈ దాడుల్లో ఒడిశాకు చెందిన 33 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. బలదలో పట్నాన యోగేశ్వరరావుకు చెందిన దుకాణంలో తనిఖీలు చేయగా 21 మద్యం సీసాలు, పాగోటి సూర్యనారాయణకు చెందిన దుకాణంలో 12 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశామన్నారు. మద్యం బాటళ్లను సీజ్ చేసినట్లు చెప్పారు.

టీబీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పొట్నూరు చిరంజీవి

కొత్తూరు: మండలంలోని నివగాం గ్రామంలో టీబీ వ్యాధిపై పాతపట్నం టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.చిరంజీవి సోమవారం అవగాహన కల్పించారు. టీబీ బారినపడిన వారంతా క్రమం తప్పకుండా మందులు వాడాలన్నారు. మందులు వాడిన ఆరు నెలల సమయంలో పోషకాహారం కోసం ప్రభుత్వం రూ.6 వేలు అందిస్తుందన్నారు. ఉచితంగా మందులు అందివ్వడంతోపాటు పలు రకాల టీబీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. పోషకాహారం లోపించడం వలన పలువురు టీబీ బారినపడుతున్నట్లు చెప్పారు. టీబీ వ్యాధిగ్రస్తులు మందులు వాడటం ఆపేస్తే ఎండీఆర్ టీబీగా మారిపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రతీ టీబీ రోగి మందులు క్రమం తప్పకుండా వాడేలా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్ మీసాల వనిత, 104 వాహనం సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపీ చేస్తున్న ఈశ్వరరావు

పాతపట్నం: ఫిజియోథెరపీతో అంగవైకల్యాన్ని దూరం చేయవచ్చని ఫిజియోథెరపిస్టు ఎం.ఈశ్వరరావు అన్నారు. స్థానిక ఎమ్మార్సీలో ప్రత్యేకావసరాల విద్యార్థులకు సోమవారం ఫిజియోథెరపీ నిర్వహించారు. ఇంటి వద్ద క్రమం తప్పకుండా వ్యాయామం ఎలా నిర్వహించాలో తల్లిదండ్రులకు, ఐఆర్‌టీలకు అవగాహన కల్పించారు. సహిత విద్యా ఉపాధ్యాయులు పి.సుధారాణి, ఇన్నా, సీఆర్పీలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.